సాక్షి
మెదక్
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



డెంగీ.. డేంజర్ బెల్స్..!

ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద చెత్తా చెదారం నిండిపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

వివరాలు 8లో ▸



కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా నిరుద్యోగ మహిళలు, యువతకు కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ అందిస్తున్నారు.

వివరాలు 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: కౌడిపల్లి, టేక్మాల్ మండలాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తాత్కాలిక బోధనకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మెదక్ కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.
89855 54525

న్యూస్‌రీల్

గ్రామీణ క్రీడలకు ఊతం



క్రీడాకారులతో కాంగ్రెస్ నాయకులు

కొల్చారం(నర్సాపూర్): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా పోటీలతో క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించవచ్చని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గాలి అనిల్ కుమార్ అన్నారు. మండలం రంగంపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రీడాపోటీలకు హాజరయ్యారు. కౌడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీధర్ రెడ్డి, నర్సాపూర్, కొల్చారం కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు రాజు, నాయకులు మల్లేశం, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సిబ్బంది కృషి చేయాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది కీలకంగా వ్యవహరించాలని, గణేష్ నిమజ్జనోత్సవం ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ రవికాంత్‌రావు, సిబ్బంది ఉన్నారు.

సమానం వేతనం ఇవ్వండి

మెదక్ కలెక్టరేట్: రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా తమకు వేతనం ఇవ్వాలని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమాఖ్య జిల్లా ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా.. కనీస వేతనం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ కార్డ్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. స్పందించిన చైర్మన్ త్వరలో అనుకూల ప్రకటన చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆశ, అంగన్‌వాడీల సమ్మె

రామాయంపేట(మెదక్): డిమాండ్ల సాధనకై అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. వారికి ఆశ కార్యకర్తలు తోడు కలిశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీలతో పాటు ఆశ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు.

నిధుల స్వాహాపై చర్యలేవీ?

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

- జెడ్పీ సమావేశంలో సభ్యుల మండిపాటు
- తనను మాట్లాడనివ్వడం లేదని నిజాంపేట జెడ్పీటీసీ ఆగ్రహం
- పోడియం ఎదుట బైఠాయించి నిరసన



పోడియం వద్ద కూర్చొని నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ విజయ్‌కుమార్

మెదక్: ఎన్ఆర్ఈజీఎస్ నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చేగుంట జెడ్పీటీసీ, నార్సింగ్ ఎంపీపీలు డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత భవనంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి పనులు చేయకున్నా.. చేసినట్లు బిల్లులు తీసుకున్నవారిపై డీఆర్‌డీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ.. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతు రుణమాఫీ, ఎరువులు, రేక్ పాయింట్స్, గోదాంల నిర్మాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ వివరించారు. జిల్లాకు 50వేల ఎకరాల ఆయిల్‌పామ్ మంజూరైందని, ఈ ఏడాది 5వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్ణయించామని హార్టికల్చర్ జిల్లా అధికారి నర్సయ్య తెలిపారు. ఆయిల్‌పామ్‌పై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కొల్చారం జెడ్పీటీసీ మేఘమాల కోరారు. చేగుంట ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీబీవీ స్కూళ్లలో నైట్ వాచ్‌మెన్ ఏర్పాటుతో పాటు వీధిలైట్లను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా.. విషయాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.

విద్య, వైద్యంపై..

జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ జిల్లాలో మనబడి కింద మొదటి విడతలో 300 పైచిలుకు పాఠశాలలకు మరమ్మతు చేసినట్లు తెలిపారు. తమ మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని వెంటనే నియమించాలని రేగోడ్ జెడ్పీటీసీ కోరారు. తెలంగాణ వచ్చాకే రెసిడెన్షియల్ స్కూల్, నవోదయతో పాటు నేడు జిల్లాకు ఒక మెడికల్ కళాశాల మంజూరైందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. జిల్లా వైద్యాధికారి చందునాయక్ మాట్లాడుతూ జిల్లాలో 31 డెంగీ కేసులు, 61 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయని, బాధితులకు పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నామన్నారు. 117 పల్లె దవాఖానాలు మంజూరు కాగా 16 పూర్తయ్యాయని అన్నారు. ప్రతీ గ్రామానికి రూ.20లక్షల చొప్పున మంజూరైన నిధులను వేటికి ఖర్చు చేయాలో వివరించాలని పెద్దశంకరంపేట ఎంపీపీ కోరగా.. డీపీఓ సాయిబాబ సమాధానమిస్తూ.. విధివిధానాలను త్వరలోనే తెలుపుతామని అన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషితో గజ్వేల్, మెదక్‌లో రేక్ పాయింట్లు ఏర్పాటయ్యాయని, ధాన్యం కొనేందుకు కేంద్రం నిరాకరించినా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కొనుగోలు చేసిందన్నారు. శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ, కొల్చారం, వెల్దుర్తి, జెడ్పీటీసీలు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో వ్యవసాయం పండుగలా మారిందని అన్నారు.



జెడ్పీటీసీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

సభ నుంచి వాకౌట్..

రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, ఎరువుల దిగుమతి కోసం రేక్ పాయింట్ ఇంకా పూర్తి చేయలేదని నిజాంపేట జెడ్పీటీసీ విజయ్‌కుమార్ ఆరోపించారు. రైతులకు ఇచ్చే ఎరువుల్లో కేంద్ర సబ్సిడీ వాటాను ప్రజలకు వివరించాలని కోరారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ మాట్లాడుతూ.. ఖాతాల్లో టెక్నికల్ సమస్య ఉన్నవారు మినహా దాదాపు అందరికీ రుణమాఫీ అయ్యిందని, ఎరువుల ర్యాక్‌పాయింట్ వచ్చే ఏడాదిలో పూర్తవుతుందని అన్నారు. అనంతరం జెడ్పీటీసీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నిజాంపేట మండలంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని, అయినా నేటికి పనులు ప్రారంభించలేదని అన్నారు. గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. సభలో ఒక్కరే మాట్లాడితే ఎలా.. మిగతా సభ్యులకు కూడా అవకాశం ఇవ్వాలంటూ రేగోడ్, నార్సింగి, వెల్దుర్తి, పెద్దశంకరంపేట జెడ్పీటీసీ, ఎంపీపీలు పట్టుబట్టారు. దీంతో కొద్దిసేపు సభలో గందరగోళం నెలకొంది. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తనను తప్పుబడుతున్నారంటూ నిజాంపేట జెడ్పీటీసీ సభ్యుడు పంజా విజయ్‌కుమార్ ఆరోపించారు. పోడియం వద్దకు వెళ్లి కింద కూర్చొని నిరసన తెలిపి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, జెడ్పీ సీఈఓ శైలేశ్‌తో పాటు జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

స్థానికంగా ఉన్నా.. సమావేశానికి డుమ్మా

- జెడ్పీ సమావేశానికి గైర్హాజరు
- ప్రజా ప్రతినిధుల తీరుపై పలువురి విమర్శలు

మెదక్: మూడు నెలలకోసారి ప్రజాసమస్యలపై నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరుకావాల్సిన ప్రజాప్రతినిధులు గైర్హాజరవుతున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన జెడ్పీ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రి హాజరుకాకపోవటంపై అధికార పార్టీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేశారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పెద్ద శంకరంపేట, ఆందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలతో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట, నార్సింగ్‌తో పాటు గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు ఉన్నాయి. ఈ సమావేశానికి మెదక్, నర్సాపూర్, అందోల్, దుబ్బాక, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలతో పాటు మెదక్, జహీరాబాద్ ఎంపీలు, జిల్లా మంత్రి సైతం హాజరు కావాల్సి ఉండగా.. కేవలం నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాత్రమే హాజరయ్యారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్, హవేళీఘనాపూర్, మండలాలతో పాటు మెదక్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె.. సమావేశానికి హాజరు కాలేకపోయారు.

అక్టోబర్ 4న ఆఖరి ముసాయిదా

కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: అక్టోబర్ 4న ఆఖరి ఓటరు ముసాయిదా విడుదల చేయనున్నందున కొత్త ఓటర్ల నమోదుపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నూతన ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఓటరు జాబితాపై బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి, క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. నకిలీ ఓటర్లు, డబుల్ ఎంట్రీలు లేకుండా సహకరించాలని కమిటీలకు సూచించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ అధికారి జెమ్లా నాయక్, మెదక్ నర్సాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్, నియోజకవర్గ మతపెద్దలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

జీఓ రద్దుకు పోరాటం

మెదక్ కలెక్టరేట్: జీఓ 142 రద్దు చేయాలని కోరుతూ జిల్లాకు చెందిన వైద్య ఉద్యోగుల జేఏసీ నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా, డీఎంహెచ్ఓలకు మెమొరాండం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. ఈ జీఓతో కింది స్థాయి కేడర్ నుంచి డాక్టర్ల వరకు ప్రతి ఒక్కరికి నష్టం జరుగుతోందని, ప్రభుత్వం దీనిని రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వైద్య ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతోనే ఐదో స్థానం

డీపీఎం వెంకటేశ్వర్లు



మహిళా సంఘాల ప్రతినిధులతో అధికారులు

నర్సాపూర్: మహిళా సంఘాలకు బ్యాంక్ రుణాలు ఇప్పించడంలో నర్సాపూర్ మండలం రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచిందని బ్యాంక్ లింకేజీ డీపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన టార్గెట్‌ను ఐదు నెలల్లో పూర్తి చేశారని, సిబ్బంది అంకిత భావంతో పని చేయడంతోనే రాష్ట్ర స్థాయిలో ఐదోస్థానంలో నిలిచామని కొనియాడారు. ఏపీఎం రాము మాట్లాడుతూ.. మండలానికి ఇచ్చిన 23 ఆహార ఉత్పత్తుల యూనిట్లను త్వరగా గ్రౌండింగ్ చేయించాలని సూచించారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వెంకటేష్ బ్యాంక్ లింకేజ్ కింద రూ.7.18కోట్ల చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఉత్తమ సంఘాలుగా ఎంపికైన ఎల్లాపూర్, రాంచంద్రాపూర్, బ్రాహ్మణపల్లి, చిప్పలతుర్తి, చిన్నచింతకుంట గ్రామాల ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించి, ఉత్తమ సీఏలు నాగరాణి, శివలక్ష్మి, మాధవి, కవితను సన్మానించారు. సమావేశంలో ఏపీఎం గౌరిశంకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామ మహిళ సంఘాల ప్రతినిధులు మానవహారంగా ఏర్పడి చేతులు శుభ్రంగా కడుగుకునే విధానంపై అవగాహన కల్పించి పోషణ ప్రతిజ్ఞ చేశారు.

బాధితులకు న్యాయం అందిస్తాం

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీరోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారులు పెట్టుకున్న సమస్యలకు చట్టప్రకారం పరిష్కారం చూపాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని జిల్లా పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఈ సందర్భంగా కాడిగిద్ద యాదిరెడ్డి అనే వ్యక్తి తన భూమిలో అక్రమంగా గోడ కట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చేగుంట మండలం కర్నాల్‌పల్లికి చెందిన నర్సారెడ్డి ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు రామన్నగారి మనోజ్ మృతిపై అనుమానం ఉందని, విచారణ జరిపి మృతికి కారణమైన బాధ్యులపై చర్య తీసుకోవాలని మెదక్ మండలం పేరూరు గ్రామానికి చెందిన పోచయ్య ఫిర్యాదు చేశాడు. బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

గజ్వేల్ మరో డల్లాస్.. ఏమైంది?



గజ్వేల్‌లో మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ

- రెండు చోట్లా కేసీఆర్‌కు ఓటమి తప్పదు
- కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీ మండిపాటు

గజ్వేల్/తూప్రాన్: 'గజ్వేల్‌ను మరో డల్లాస్, లండన్, న్యూయార్క్ చేస్తున్నామంటూ ప్రకటనలు గుప్పించారు.. ఇక్కడికి వచ్చి చూస్తే అట్ల ఏమీ కనిపిస్తలేదు.. ఉన్న బస్టాండ్‌ను కూలగొట్టి రేకుల షెడ్డును నిర్మించిండ్రు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇంకా పూర్తి చెయ్యలే. గిదేనా..? మీరు చేసిన అభివృద్ధి? ఈసారి ఎన్నికల్లో గజ్వేల్‌లోనే కాదు.. కామారెడ్డిలో కూడా కేసీఆర్ ఓడిపోవడం ఖాయం' అని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. సోమవారం కామారెడ్డికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో అర్ధంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల పనుల తోపాటు గజ్వేల్ పట్టణంలో బస్టాండ్, రింగు రోడ్డు, మినీ స్టేడియంను పరిశీలించారు. గజ్వేల్‌ను బంగారు తునకగా మారుస్తానని చెప్పిన కేసీఆర్ ఆచరణలో విఫలమయ్యారని ఆరోపించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రకటన ల నేపథ్యంలో కామారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటిస్తున్నానని చెప్పారు. మంత్రులు చెబుతున్నదానికి ఇక్కడ పరిస్థితికి పొంతన లేదని విమర్శించారు. వర్గల్‌లో పేదలకు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన 1,200 ఎకరాల భూమిని ఫుడ్ పార్కు పేరిట లాక్కుంటున్నారని ఆరోపించారు.

తూప్రాన్‌లో పర్యటన..

మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డితో కలిసి తూప్రాన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అల్లాపూర్ రోడ్డును పరిశీలించి ఇదే అభివృద్ధి అంటే..? అంటూ విమర్శించారు.

మూడు కుటుంబాల్లో విషాదం

చెరువులో మునిగి ముగ్గురు మహిళల మృతి, బాలుడి గల్లంతు

- బాలుడి కోసం గజఈతగాళ్లతో గాలింపు



చెరువులో గాలిస్తున్న గజఈతగాళ్లు



లావణ్య (ఫైల్)



బాలమణి (ఫైల్)



లక్ష్మి (ఫైల్)



చరణ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): అప్పటి వరకు సరదాగా మాట్లాడుకుంటూ బట్టలు ఉతుకుతున్న వారి పాలిట చెరువు యమకూపంగా మారింది. ముగ్గురు మహిళలు మృత్యువాత పడగా, బాలుడు గల్లంతయ్యాడు. మరో మహిళ ప్రాణాలతో బయట పడింది. ఈ విషాదకర ఘటన మనోహరాబాద్ మండలం రంగాయపల్లి చెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాయపల్లికి చెందిన ఫిరంగి చంద్రయ్య, లక్ష్మికి కూతురు లావణ్య (23), ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన బోనాల పండుగకు లక్ష్మి తన సోదరులు కుటుంబాలను ఆహ్వానించింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంబర్‌పేట్‌కు చెందిన దుడ్డు యాదగిరి, శ్రీకాంత్ డ్రైవర్లుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్క లక్ష్మి ఆహ్వానంతో యాదగిరి భార్య బాలమణి (30), శ్రీకాంత్ భార్య లక్ష్మి(25), పిల్లలతో కలసి పండుగకు వచ్చారు.

బట్టలు ఉతికేందుకు వెళ్లి..

సోమవారం మధ్యాహ్నం బట్టలు ఉతికేందుకు ఫిరంగి లక్ష్మి, తన కూతురు లావణ్య(23), మరదళ్లు బాలమణి, లక్ష్మిని తీసుకొని చెరువు వద్దకు వెళ్లింది. వీరి వెంట బాలమణి, యాదగిరి కుమారుడు చరణ్(10) కూడా వచ్చాడు. ఈ క్రమంలో చరణ్ ఆడుకుంటూ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తల్లి బాలమణి కాపాడేందుకు ప్రయత్నించి అదుపుతప్పి నీటిలో మునిగిపోయింది. ఆమెను కాపాడేందుకు లావణ్య, లక్ష్మి ఒకరివెంట ఒకరు వెళ్లి నీటమునిగారు. పక్కనే ఉన్న ఫిరంగి లక్ష్మి కాపాడండి అంటూ కేకలు వేస్తూ.. నీళ్లలోకి దిగింది. ఈ క్రమంలో లక్ష్మి కూడా నీటమునిగింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ యువకుడు స్పందించి నీటిలో మునిగిపోతున్న లక్ష్మిని బయటకు లాగి నీటిని కక్కించడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని బాలమణి, లక్ష్మి, లావణ్యల మృతదేహాలను బయటకు తీశారు. తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు, చరణ్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు.

బాధితులకు వంటేరు పరామర్శ



చెరువులో జేసీబీ గుంతలే నలుగురి మృతికి కారణమయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు. తమ వాళ్లు లేరన్న విషయం జీర్ణించుకోలేక గుండెలు బాదుకుంటూ... దేవుడా ఎంత పని చేస్తివి... మా వాళ్ళను తీసికెళ్లిపోతివా.. అంటూ కన్నీరు పెట్టడం అక్కడున్న ప్రతీ ఒక్కరిని కదిలించింది. ఘటనతో మూడు కుంటుంబాల్లో విషాదం అలుముకుంది. పండుగ కోసం ఆడబిడ్డ ఇంటికి వెళ్లి మృత్యువాత పడడంతో అంబర్‌పేట్ గ్రామస్తులు రంగాయపల్లి చెరువు వద్దకు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

అమ్మవార్లకు పుస్తెమెట్టెలు అందజేత



అమ్మవార్లకు వారికి బంగారు అభరణాలు అందిస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయంలోని అమ్మవార్లకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గుణపటి విష్ణురెడ్డిమౌలిక దంపతులు సుమారు 56 గ్రాములు బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు సోమవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఓ అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో హోటల్ దగ్ధం



హోటల్ వద్ద బాధితులు

నారాయణఖేడ్: పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలోని రోషన్ హోటల్ సోమవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే హోటల్ మూసివేసి ఇంటికి వెళ్లినట్లు యజమాని గౌస్ తెలిపారు. తెల్లవారుజామున హోటల్‌లో మంటలు ఎగిసి పడుతున్నాయని చుట్టుపక్కలవారు సమాచారం ఇచ్చారని చెప్పారు. వచ్చి చూసేసరికి అప్పటికే హోటల్‌లోని ఫ్రిజ్, విద్యుత్ మీటర్, స్విచ్‌లు, వైరింగ్, సామగ్రి కాలిపోయాయని తెలిపారు. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మల్లేశం(ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన మంగలి మల్లేశం(45) దౌల్తాబాద్ నుంచి ఎప్పటిలాగే సోమవారం రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో చెరువు అలుగు పోస్తున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నీటిలో పడి మల్లేశం చనిపోయిన విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కంట్లో కారం చల్లి.. పుస్తెలతాడు చోరీ



శ్వేత

పాపన్నపేట(మెదక్): ఒంటరిగా వెళుతున్న మహిళ కంట్లో కారం చల్లి మెడలో పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన సంఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు. మండలంలోని కుర్తివాడకు చెందిన పుట్టి శ్వేత భర్త బాలరాజు రెండేళ్ల క్రితం చనిపోయాడు. ఆమె తన ఇద్దరు పిల్లలతో అత్తమామలతో కలిసి ఉంటుంది. చుట్టాల ఇంట్లో శుభకార్యం ఉండటంతో రెండు రోజుల క్రితం టేక్మాల్ మండలం వెంకటాపూర్‌కు వెళ్లింది. సోమవారం తన మామ, పిల్లలతో కలిసి తిరిగి ఊరికి రావడానికి బస్సు ఎక్కారు. కుర్తివాడ వద్ద బస్సు దిగి ఊర్లోకి నడుస్తూ వస్తుండగా మార్గమధ్యలో తెలిసిన వాళ్లు రావడంతో వారిని బండిపై పంపింది. తను ఒంటరిగా వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి బైక్‌పై వచ్చి కంట్లో కారం చల్లి రెండున్నర తులాల పుస్తెలతాడు తెంపుకుని వెళ్లిపోయారు. బండికి నంబర్ ప్లేట్ లేదని తెలిపింది. వారితో జరిగిన పెనుగులాటలో కిందపడి శ్వేతకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మెదక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

డెంగీ.. డేంజర్ బెల్స్..!



అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య సమస్య
- రోడ్లపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- దోమల స్వైరవిహారం
- పత్తా లేని ఫాగింగ్
- డెంగీ రోగులతో ఆస్పత్రులు కిటకిట

జిల్లాలో డెంగీ జ్వరాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగునీరు నిలిచిపోవడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా దోమల బెడద పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెంగీ జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఈ కేసులు రోజురోజుకూ అధికమవుతున్నాయి.. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

మురుగు కూపంగా డంప్‌యార్డు ప్రాంతం



బీసీ కాలనీ దారిలో మురుగు కాల్వ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు పాక్షికంగా శిథిలమై ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు సీజనల్ వ్యాధులతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజూ మూడు ట్రాక్టర్లు, మూడు ఆటోల్లో చెత్తను సేకరిస్తున్నారు. ప్రతీరోజు కనీసం 6 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా, దీనిని ఆరు బయట వేస్తుండడంతో గుట్టపై ప్రాంతం కలుషితమైంది. దీనితో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంకోసం నిర్మించిన షెడ్ నిరుపయోగంగా ఉంది.



ఎక్కలదేవుని బండపై చెత్త కుప్పలు

వ్యాధి లక్షణాలతో ఇటీవల బాలుడి మృతి

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి పగలు తేడాలేకుండా దోమలు విపరీతంగా విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నారు. ఇటీవల డెంగీ లక్షణాలతో మెదక్ పట్టణంలో ఒక బాలుడు మృత్యువాత పడ్డాడు. విష జ్వరాల బాధితులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న విష జ్వరాలపై ఆరోగ్యశాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మెదక్ పట్టణంలో ప్రజలు డెంగీ బారిన పడతామని భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి రక్షణ కరువైందని వాపోతున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ వీధుల్లో దోమలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. ప్రజలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వ్యాధుల బారిన పడక తప్పడం లేదు. దోమల నివారణ చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు మొక్కుబడి కార్యక్రమాలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల్లో ఏర్పాటు చేయాల్సిన చెత్త బుట్టలను మున్సిపల్ కార్యాలయంలో నిర్లక్ష్యంగా పారవేశారు. దీంతో పలు వీధుల్లో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో వీధుల్లో పారవేస్తున్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది.దోమల వృద్ధికి ఇది కూడా కారణంగా మారుతోంది. తక్షణ చర్యలు చేపట్టాల్సిన పాలకులు, వైద్య సిబ్బంది ఎక్కడా కనిపించడం లేదు. దోమల నివారణకు ప్రత్యేక ప్రణాళికలు, విధానాలు చేపట్టాల్సిన అధికారులు నామమాత్రంగా ఫాగింగ్, ఆయిల్ బాల్స్, కిమోపాస్ పిచికారి చేస్తున్నా.. అది పూర్తిస్థాయిలో చేపట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలడంతో నిత్యం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. గతంలో దోమల నివారణకు వార్డుల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అధికారులు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడంలేదు. ఇటీవల మెదక్‌లోని వెంకట్రావ్ నగర్ కాలనీలో డెంగీ లక్షణాలతో నాలుగున్నరేళ్ల బాలుడు మృత్యువాత పడడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



వెంకట్రావ్ నగర్ కాలనీలో ఖాళీ స్థలంలో నిలిచిపోయిన మురుగునీరు



నర్సాపూర్‌లోని ప్రధాన రోడ్డు పక్క మురుగునీరు

వైరల్ జ్వరాల విజృంభణ

నర్సాపూర్: పలు పంచాయతీల్లో మురగు కాల్వలు సరిగా నిర్మించకపోవడంతో మురుగు నీరు, వర్షం నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరుగుతున్నాయి. దోమల స్వైరవిహారంతో ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారు. సెప్టెంబరు ఆరంభం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో 120 మంది జ్వరంతో చికిత్సపొందుతున్నారు.10 మంది టైఫాయిడ్ బారిన పడినట్లు వైద్యులు తెలిపారు. చాలా వార్డుల్లో మురుగు కాల్వలు నిర్మించనందున నీరు నిలిచిపోయి దోమలు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నర్సాపూర్‌లోని 8వ వార్డులో దారిలో పారుతున్న మురుగు నీరు

అస్వస్థతకు గురవుతున్నాం



పట్టణంలోని 8వ వార్డు ఏరియాలో మెయిన్ రోడ్డు పక్క డ్రైనేజీ నిర్మించలేదు. మురుగునీరంతా రోడ్డు పక్కనే నిలిచిపోతోంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగి అస్వస్థతకు గురవుతున్నాం

– రాంచందర్, నర్సాపూర్

ఫాగింగ్ చేయిస్తున్నాం

మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ చేయిస్తున్నాం. మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టాం. ఇంకా పలు వార్డుల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

– వెంకటగోపాల్, నర్సాపూర్ కమిషనర్

చర్యలు తీసుకుంటాం

డంప్‌యార్డు వద్దకు వెళ్లడానికి రోడ్డు సదుపాయం సరిగా లేదు. దీంతో చెత్త వాహనాలు సరిగా వెళ్లడంలేదు. తడి, పొడి చెత్త వేర్వేరుగా చేయడానికి సెగ్రిగేట్ సరిగా అమలు కావడంలేదు. ఫలితంగా చెత్తను ఆరుబయటనే వేయాల్సి వస్తోంది. మల్లెచెరువులోకి మురుగునీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

– ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్

నివారణ చేపడుతున్నాం



పట్టణంలో దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిస్తే వాటిల్లో ఆయిల్ బాల్స్ వేయించాం. ప్రతిరోజు వార్డుల్లో ఫాగింగ్ కూడా చేయిస్తున్నాం. హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన కిమోపాస్ మందును పిచికారీ చేస్తున్నాం.

– జానకీరాం సాగర్, మున్సిపల్ కమిషనర్, మెదక్

శభాష్ పోలీసన్న!

- విద్యార్థికి ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ చేయూత
- బుక్స్, నగదు అందజేత

సిద్దిపేటకమాన్: తండ్రి చనిపోవడం, తల్లి అనారోగ్యం కారణంగా ఓ విద్యార్థి చదువు మానేసి కూరగాయలు అమ్ముతుంది. అమ్మాయి దీన స్థితి తెలుసుకొని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ చలించిపోయాడు. కొంత డబ్బుతో పాటు బుక్స్ కొనుగోలు చేసి ఇచ్చి మానవత్వం చాటుకున్నాడు. ఈ విషయం తెలుసుకుని పలువురు ఆయనను శభాష్ పోలీస్ అని ప్రశంసించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన గుగులోత్ లలిత, లింగులు దంపతులు తమ కూతురు, కుమారుడితో కలిసి కొన్నేళ్ల క్రితం సిద్దిపేటకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. లింగులు కూలీ పనులు చేస్తూ, లలిత కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కూతురు అంజలి మద్దూర్ కేజీవీబీలో 10వ తరగతి, కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా ఈ ఏడాది లింగులు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ బెంగతో భార్య లలిత కూడా అనారోగ్యానికి గురై రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకుంది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితితో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో అంజలి తన స్కూల్ మానేసి అమ్మ చేసిన పని కొంత మేరకు తెలిసి ఉండడంతో హైదరాబాద్ రోడ్డులోని అక్షయ గ్రాండ్ హోటల్ సమీపంలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతూ వచ్చిన డబ్బులతో ఇంట్లోకి సామాగ్రి తీసుకెళ్తుంది. వారం రోజుల క్రితం రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న అమ్మాయిని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్ గమనించాడు. అమ్మాయి కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకుని చలించిపోయాడు. దీంతో సోమవారం విద్యార్థిని మంజుల, తన పిన్నిని మోడ్రన్ బస్టాండ్ చౌరస్తా వద్దకు పిలిపించి నగదు సాయంతో పాటు బుక్స్ కొనుగోలు చేసి విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమేష్‌తో కలిసి అందజేశారు. దీంతో విద్యార్థిని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎవరైనా సాయం చేయాలనుకుంటే 9652213177 నెంబర్‌కు ఫోన్‌పే, గుగూల్‌పే చేసి ఆదుకోవాలని కోరారు.



విద్యార్థినికి బుక్స్ అందజేస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్, పక్కన ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమేష్

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

జెడ్పీ సీఈఓ రమేశ్

హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ మండల పరిషత్ వివాదం త్వరలో ముగిస్తుందని, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెగ్యులర్ కాబోయే పంచాయతీ కార్యదర్శుల పని తీరును ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సాక్షిలో వచ్చిన 'పోస్టింగ్ హుస్నాబాద్‌లో..విధులు అక్కన్నపేటలో 'కథనానికి స్పందిస్తూ.. మండలాలు విభజన జరిగిన సమయంలో అక్కన్నపేటలో సిబ్బంది లేనందున అక్కడికి సూపరింటెండెంట్ పోస్టును ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు వీఆర్వోలను వివిధ శాఖలకు పంపించడం వల్ల అక్కన్నపేట మండల పరిషత్‌లో సిబ్బంది ఉన్నప్పటికీ అనుభవం లేనందున సూపరింటెండెంట్‌ను అక్కడ నుంచి హుస్నాబాద్‌కు తీసుకోలేదన్నారు. కలెక్టర్‌కు నివేధించి సూపరింటెండెంట్‌ను హుస్నాబాద్‌కు తీసుకోనేందుకు చర్యలు తీసుకుంటాం. హుస్నాబాద్ మండల పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య ముదిరిన వివాదానికి కలెక్టర్ రాగానే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. సెలవులో వెళ్లిన ఎంపీడీఓ తిరిగి విధుల్లో చేరడమా...? కొత్త వారికి బాధ్యతలు అప్పగించడమా ఏదో ఒకటి జరుగుతుందన్నారు. వీరి వెంట ఇంచార్జి ఎంపీడీఓ సత్యనారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఈఓ రమేశ్

చిరుత కలకలం.. తండావాసుల జాగారం

శివ్వంపేట(నర్సాపూర్): చిరుత సంచారంతో తండా వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. మండల పరిధి బిక్యా పంచాయతీ పరిధిలోని సిత్యా తండాలో శనివారం రాత్రి చిరుత సంచరించడంతో పరిసర తండా వాసులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలాల వద్దకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. తండాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చిరుత భయంతో బిక్యా, నాను, సిత్యా, గెమ్‌సింగ్, తుక్యా, తాళ్లపల్లి తండాల వాసులు రాత్రి వేళ జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం రాత్రి తండాల వాసులు గుంపులుగా కర్రలు చేత పట్టుకొని జాగారం చేశారు. అటవీ సిబ్బందికి చిరుత విషయం తెలిపినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.



కర్రలు చేత పట్టుకుని జగారం చేస్తున్న తండా వాసులు

రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మొయినాబాద్ మండలం చిన్న మంగళారంకు చెందిన షేక్ మహ్మద్ ఆటోలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలో విక్రయించేందుకు వచ్చినట్లు బీడీఎల్ పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో పౌర సరఫరా అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఆటోతోపాటు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పటాన్‌చెరు పౌర సరఫరా డిప్యూటీ తహసీల్దార్ విష్ణు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ షేక్ మహ్మద్, ఓనర్ మహబూబ్‌లపై కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యం

బట్టలు అమ్మడానికని వెళ్లి...



ప్రభాకర్

దుబ్బాక: రోజు మాదిరిగా బట్టలు అమ్మడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన దుబ్బాకలో జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చీర్లంచ ప్రభాకర్ (54) ఊరూరా తిరుగుతూ బట్టలు అమ్ముతూ ఉంటాడు. రోజు మాదిరిగా ఆదివారం కూడా వెళ్లాడు. రాత్రి అయినా ప్రభాకర్ ఇంటికి రాకపోవడంతో భార్య రాధ ఫోన్ చేసింది. స్విచ్ ఆఫ్ రావడంతో స్థానికులతో కలిసి వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభాకర్ ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెల్ల చొక్కా, గోధుమ రంగు ప్యాంట్ ధరించినట్లు చెప్పారు.

తల్లి, ఇద్దరు పిల్లలు ...



లలిత

పటాన్‌చెరు టౌన్: తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు. భానూర్ పరిధిలోని కంచర్ల గూడెం గ్రామానికి చెందిన నరేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన ఆటో తీసుకొని ఉదయం బయటికి వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య లలిత, పిల్లలు సాయి నిహాల్, రిషికలు కనిపించలేదు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుని మోసం చేశాడని..

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ప్రియురాలు

కల్హేర్(నారాయణఖేడ్): ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి ప్రియురాలు ఆందోళన చేసింది. సోమవారం కల్హేర్ మండల కేంద్రంలో సంఘటన జరిగింది. బాధితురాలు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా సత్తేపల్లి మండలం తాళ్లచెరువుకు చెందిన కుంచపు రజిని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్‌కు చెందిన వల్లూరి రమేష్, కుంచపు రజినికి సిద్దిపేటలో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. పరిచయం కాస్త ప్రేమగా మారింది. స్నేహితుల సహకారంతో 2022 ఏప్రిల్ 15న వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఏడాదిన్నర పాటు ఇద్దరు కలిసి ఉన్నారు. ఇటీవల ఇంటికి వచ్చిన రమేష్ ఆమెకు దూరంగా ఉంటున్నాడు. దీంతో రజని హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రమేష్ ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో ఆమె కల్హేర్‌కు వచ్చింది. రమేష్ ఇంటికి తాళం వేసి ఉండటంతో అక్కడే కూర్చుని ఆందోళన చేపట్టింది. న్యాయం చేయాలని కల్హేర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించింది. రమేష్ తండ్రిని పోలీసులు పిలిచి రమేష్‌ను తీసుకురావాలని ఆదేశించారు. మంగళవారం తీసుకొస్తానని చెప్పాడు.



ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన రజిని

కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

సిద్దిపేటకమాన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. పోలీసుశాఖ, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆర్థికసాయంతో నిరుద్యోగ మహిళలు, యువతకు కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేటలో పైలెట్ ప్రాజెక్టుగా డ్రైవింగ్‌పై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 35 మంది మహిళలకు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చి, అనంతరం ఆర్టీఓ అధికారితో మాట్లాడి డ్రైవింగ్ లైసెన్స్ అందించనున్నట్లు చెప్పారు. అలాగే క్యాబ్ కొనుగోలుకు, డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఆఫ్ ఇండియా బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ రాఘవ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, రాజలింగం, సిబ్బంది నజీమ్, నాగరాజు, ఎస్బీ సీఐ రఘుపతిరెడ్డి, కానిస్టేబుల్ పరందాములు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణ సాయం

సిద్దిపేటకమాన్: బాధిత మహిళలకు భరోసా కేంద్రం, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ అండగా ఉంటుందని సీపీ శ్వేత అన్నారు. ఆ కేంద్రాల సిబ్బందితో సోమవారం సీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోక్సో, అత్యాచార బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. భరోసా సెంటర్ సేవల కోసం 08457-293098, డయల్ 100.. గృహహింస, వరకట్న వేధింపులకు గురైతే స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ 9494639498కు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లాఅండ్‌ఆర్డర్ మల్లారెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్వేత